ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

- కోట్లు విలువజేసే స్థలంపై కన్ను
- ఆలయ నిర్మాణం పేరుతో బరితెగింపు
- గుట్టుచప్పుడు కాకుండా హోమాలు, పూజలు
- స్థలం కట్టబెట్టేందుకు డీల్ కుదుర్చుకున్న టీడీపీ నాయకులు



ఎనికేపాడు 24కె కల్యాణ మండపం వెనుక ప్రభుత్వ స్థలంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న హోమాలు

రామవరప్పాడు: కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ స్థలాలకు రక్షణ లేకుండా పోతోంది. ప్రభుత్వానికి చెందిన ఖాళీ స్థలాలు కనిపిస్తే చాలు గద్దల్లా వాలిపోయి ఆక్రమించేస్తున్నారు. తాజాగా విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులో కోట్లు విలువజేసే కామన్ స్థలాన్ని ఆలయ నిర్మాణం మాటున ఆక్రమించారు. గ్రామంలోని 24కె కల్యాణ మండపం వెనుక ప్రాంతంలో పంచాయతీ కామన్ స్థలం ఉంది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీమోహన్ సహకారంతో ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ కామన్ స్థలంలో వాటర్ ట్యాంక్, సచివాలయం, కమ్యూనిటీహాల్ నిర్మాణం చేసి ప్రజల అభిమానాన్ని చూరగొన్నారు. వీటి నిర్మాణాలకు కొంత స్థలం పోగా సుమారు 15 సెంట్లకు పైగా స్థలం మిగులుతుంది. ఈ ప్రాంతంలో బహిరంగ మార్కెట్లో సెంటు స్థలం విలువ సుమారు రూ.30 లక్షలకు పైగా ఉంది. అంటే 10 సెంట్ల స్థలం రూ.3 కోట్లు పలుకుతుంది. ఈ స్థలంపై కన్నేసిన కొంత మంది వాసవి అమ్మవారి ఆలయ నిర్మాణం పేరుతో ఆక్రమణకు తెరలేపారు.

గుట్టు చప్పుడు కాకుండా హోమాలు

వాసవి అమ్మవారి ఆలయానికి స్థలం కేటాయించారని చెప్పుకుంటూ ఈ కామన్ స్థలంలో గుట్టుచప్పుడు కాకుండా బుధవారం శాంతి హోమం, సంకల్ప హోమాలను నిర్వహించారు. గ్రామ టీడీపీ నాయకుల అండదండలతో ప్రభుత్వానికి చెందిన స్థలంలో టెంట్లు వేసి అట్టహాసంగా హోమాలు నిర్వహించారు. ఇంత జరుగుతున్నా సంబంధిత పంచాయతీ అధికారులు నోరు మెదపకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. గ్రామ టీడీపీ నాయకుల ఒత్తిడితో పంచాయతీ అధికారులు మిన్నకుండిపోయారని పలువురు బహిరంగంగా విమర్శిస్తున్నారు. నిబంధనల ప్రకారం ప్రభుత్వ స్థలంలో ఆలయాలు, ఇతరత్రా కట్టడాలు నిర్మించాలంటే జిల్లా కలెక్టర్ అనుమతులు తప్పనిసరి. కాని ఇవేవీ పట్టని స్వార్థపరులు వీరి ఇష్టారాజ్యంగా ప్రవర్తించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

టీడీపీ నాయకులతో డీల్

గ్రామానికి చెందిన ఈ కామన్ స్థలం కట్టబెట్టేందుకు పెద్ద మొత్తంలో టీడీపీ నాయకులతో డీల్ కుదుర్చుకున్నట్లు సమాచారం. వాసవీ సంఘానికి స్థలం కేటాయింపు విషయాన్ని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు దృష్టికి తీసుకెళ్లి పనులు చక్కబెడతామని హామీ ఇచ్చి చక్రం తిప్పుతున్నారు. ఈ కామన్ స్థలంలో బుధవారం జరిగిన హోమాది కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు పాల్గొనడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ ప్రజలకు ఉపయోగపడాల్సిన ప్రభుత్వ స్థలాలను తమకు ఇష్టం వచ్చినవారికి ఎలా కట్టబెడతారని పలువురు ప్రశ్నిస్తున్నారు. నిబంధనలతో పని లేకుండా, అధికారుల అనుమతులు లేకుండా కోట్లు విలువజేసే స్థలం అన్యాక్రాంతం అవడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

అనుమతులు లేవు

పంచాయతీకి చెందిన కామన్ స్థలంలో హోమాలు నిర్వహించారన్న విషయం మా దృష్టికి రాలేదు. ఈ స్థలాన్ని ఇప్పటివరకూ ఎవరికీ కేటాయించలేదు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. కామన్ స్థలం కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకుంటాం.

– మండవ విద్యాధర్, పంచాయతీ కార్యదర్శి

కూటమి పాలనలో కార్మికులకు అన్యాయం

పెనమలూరు: కూటమి ప్రభుత్వ పాలనలో మున్సిపల్ కార్మికులకు అన్యాయం జరుగుతోందని రాష్ట్ర మున్సిపల్ కార్మికుల సంఘం కోశాధికారి జ్యోతి బసు ఆరోపించారు. పోరంకి త్రిమూర్తినగర్‌లో బుధవారం కృష్ణా జిల్లా మున్సిపల్ కార్మికుల మూడవ మహాసభ నిర్వహించారు. ఈ సభలో పాల్గొన్న జ్యోతిబసు మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో కూటమి ప్రభుత్వం అనేక హామీలు ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చాక కార్మికుల హక్కులు కాపాడకుండా అవుట్ సోర్స్ విధానం అమలుకు కుట్ర చేస్తోందని విమర్శించారు. ఆప్కాస్ ఎత్తివేయాలని ప్రభుత్వ కుట్రను అడ్డుకున్నామన్నారు. కార్మికులకు ఉద్యోగ విరమణ బెనిఫిట్స్, కుటుంబంలో ఒకరికి ఉద్యోగ అవకాశం, కార్మిక చట్టాలు అమలు, కార్మికుల ఉద్యోగాలు పర్మినెంట్ ఇలా అనేక సమస్యలు పరిష్కరించాలని కోరారు. సభలో జిల్లా మున్సిపల్ కార్మిక సంఘం కార్యదర్శి బి.సుబ్రహ్మణ్యం, మండల సీఐటీయూ నేత షేక్ కాశిం, వై.సరళ, లక్ష్మీప్రసన్న కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇన్‌చార్జి డెప్యూటీ ఎంపీడీఓగా సురేష్

నున్న(విజయవాడరూరల్): విజయవాడ రూరల్ డెప్యూటీ ఎంపీడీఓ గా నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి కోట సురేష్ బాబును నియమిస్తూ ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. డెప్యూటీ ఎంపీడీఓ ఎంవీడీ ప్రసాద్ సెలవు పెట్టడంతో ఇన్‌చార్జి అధికారిగా సురేష్ నియమితులయ్యారు.

క్లుప్తంగా

ముగిసిన బిజినెస్ ప్రొవైడర్‌ల శిక్షణ



గన్నవరంరూరల్: మండలంలోని సూరంపల్లి మహిళా పారిశ్రామిక వాడలో వరల్డ్ బ్యాంక్ ప్రాజెక్టు ర్యాంప్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న బిజినెస్ డెవలప్‌మెంట్ సర్వీస్ ప్రొవైడర్‌ల వర్క్‌షాప్ బుధవారం ముగిసింది. ఏపీఎంఎస్ఎంఈ నోడల్ ఏజెన్సీగా సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడ అమలు భాగస్వామిగా ఈ కార్యక్రమం నిర్వహిస్తోంది. గన్నవరం, గుడివాడ, పెనమలూరు నియోజకవర్గాల నుంచి 25మంది ఎంపిక కాగా వారికి శిక్షణ ఇచ్చారు. జిల్లా పరిశ్రమల శాఖ జీఎం ఆర్.వెంకటరావు వారిని అభినందించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలని ఆకాంక్షించారు. ఎలీప్ ప్రతినిధి కనకదుర్గ, అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

తాడిగడపలో శరవేగంగా అభివృద్ధి పనులు



పెనమలూరు: తాడిగడప మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధి పనులు శరవేగంగా చేపడుతున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. ఆయన బుధవారం యనమలకుదురులో రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కానూరు పరిధిలో మూడు మాస్టర్‌ప్లాన్ రోడ్లు సీఆర్‌డీఏ నిధులతో చేపట్టనున్నామని తెలిపారు. రానున్న నాలుగు సంవత్సరాలలో రోడ్లు, డ్రైనేజీలు అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.

పాడి రైతులకు బోనస్ పంపిణీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: దేశంలోని సహకార సంఘాల్లో ఎక్కడా లేని విధంగా కృష్ణా మిల్క్ యూనియన్ మాత్రమే ఏటా మూడు పర్యాయాలు పాడి రైతులకు బోనస్ పంపిణీ చేస్తుందని ఆ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు తెలిపారు. స్థానిక విజయవాడ రోడ్డులోని కాకాని వెంకటరత్నం పాల ఉత్పత్తిదారుల సమావేశ మందిరంలో బుధవారం ఆయన పాడిరైతులకు బోనస్ పంపిణీ చేశారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి హనుమాన్‌జంక్షన్ క్లస్టర్ పరిధిలోని 135 పాల కేంద్రాలకు మొదటి విడత బోనస్‌గా రూ.1.79 కోట్లు పంపిణీ చేస్తున్నట్లు చలసాని వివరించారు. కార్యక్రమంలో క్లస్టర్ మేనేజర్ మాగంటి హరిబాబు, పలు పాల కేంద్రాల అధ్యక్షులు, వేతన కార్యదర్శులు పాల్గొన్నారు.

పేద విద్యార్థుల ఉన్నతికి తోడ్పాటు

కేసరపల్లి(గన్నవరం): పేద విద్యార్థుల ఉన్నతికి ప్రతిఒక్కరూ తోడ్పాటునందించాలని పుణ్య చారిటీస్ అధ్యక్షుడు జాస్తి విజయభూషణ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలంలోని కేసరపల్లికి చెందిన శ్రీదేవి పిల్లల చదువుల నిమిత్తం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ, పుణ్య చారిటీస్ సంయుక్తంగా రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా విజయభూషణ్ మాట్లాడుతూ కేసరపల్లిలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో దినసరి వేతనంపై ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో శ్రీదేవి పనిచేస్తోందని, పిల్లల చదువుల కోసం ఆమె పడుతున్న కష్టాన్ని చూసి తమవంతుగా ఆర్థిక తోడ్పాటును అందించినట్లు తెలిపారు. రోటరీక్లబ్ అధ్యక్షులు జీవీ రవిబాబు, కార్యదర్శి కె.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు దసరా ఉత్సవాలపై సమీక్ష సమావేశం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో సెప్టెంబర్ 22 నుంచి అక్టోబర్ 2వ తేదీ వరకు జరిగే దసరా మహోత్సవాల ఏర్పాట్లపై దేవదాయ శాఖ అధికారులు గురువారం సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. గురువారం ఉదయం ఆలయ ప్రాంగణంలోని మహా మండపం నాల్గో అంతస్తులో నిర్వహించే సమీక్ష సమావేశానికి దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, దసరా ఉత్సవాలకు ఫెస్టివల్ ఆఫీసర్‌గా నియమితులైన పూర్వ ఈవో భ్రమరాంబతో పాటు దుర్గగుడి దేవస్థానానికి చెందిన ఇంజినీరింగ్, ఇతర విభాగాల అధికారులతో పాటు దేవదాయ శాఖ, ఇతర ముఖ్య అధికారులు హాజరుకానున్నారు. ఈ ఏడాది సింహాచలం దేవస్థానంలో చందనోత్సవ సమయంలో గోడ కూలిన ఘటన, గత నెల సింహాచలం గిరి ప్రదక్షిణ నేపథ్యంలో షెడ్డు కూలిన క్రమంలో దసరా ఉత్సవాలకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ఏర్పాట్లు చేసేలా చర్చించనున్నారు. మరో వైపున ఈ ఏడాది దసరా ఉత్సవాల ఏర్పాట్లలో ప్రభుత్వం కొన్ని కీలక మార్పులు చేయాలని దేవదాయ శాఖకు సూచించినట్లు సమాచారం. దసరా ఉత్సవాల పనులపై ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయడంతో పాటు పనుల పురోగతి, నాణ్యత వంటి అంశాలపై ఎప్పటికప్పుడు నివేదికలు ఇవ్వాలని దేవదాయ మంత్రి ఇప్పటికే ఆలయ అధికారులకు సూచించినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో గురువారం జరిగే సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది.

ఎట్టకేలకు గోసాల సెంటరు రోడ్డు అభివృద్ధి పనులు

సాక్షి స్పందన



రోడ్డు పనులను పరిశీలిస్తున్న పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్ తదితరులు

కంకిపాడు: ఎట్టకేలకు గోసాల సెంటరు రోడ్డు అభివృద్ధి పనులు పూర్తయ్యాయి. విజయవాడ–మచిలీపట్నం జాతీయ రహదారికి అనుసంధానంగా గోసాల సెంటరుకు వెళ్లే రోడ్డు మార్గం పల్లంగా ఉండటంతో తరచూ నీరు నిలిచిపోయి ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్యపై 'సాక్షి' పలుమార్లు కథనాలు ప్రచురించింది. దీనికి స్పందించిన పంచాయతీరాజ్ అధికారులు పంచాయతీ నిధులతో గోసాల సెంటరులో పల్లంగా ఉన్న రోడ్డు మార్గాన్ని తవ్వి, తిరిగి కంకరు మిక్స్‌తో మెరక చేసి తారురోడ్డు పనులు పూర్తి చేశారు. బుధవారం చేపట్టిన పనులను పంచాయతీరాజ్ డీఈ శ్రీనివాస్, ఏఈ రాజేష్, సర్పంచ్ పి.ఇందిర పర్యవేక్షించారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



ఎగ్జిబిషన్‌లో విద్యార్థులకు ఎముకలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు

గన్నవరంరూరల్: రక్తదానం ప్రాణదానంతో సమానమని చిన అవుటపల్లి డాక్టర్ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ భీమేశ్వర్ అన్నారు. కళాశాలలో జరుగుతున్న మెడికల్ అండ్ హెల్త్ ఎగ్జిబిషన్‌లో బుధవారం వేలాది మంది విద్యార్థులు పాల్గొని మానవ శరీరం, ఆరోగ్య అవగాహనపై శిక్షణ పొందారు. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన విద్యాసంస్థల విద్యార్థులు 3500 మంది ఎగ్జిబిషన్‌లో పాల్గొన్నారు. కళాశాల డైరెక్టర్ జనరల్ డాక్టర్ చదలవాడ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేడు ప్రతి కుటుంబం వ్యాధులతో పోరాడుతోందని, ఆ పరిస్థితిని నివారించేందుకు అవగాహనతో వ్యాధులకు దూరంగా ప్రజలను ఆరోగ్యవంతులుగా చేయటమే తమ కర్తవ్యమన్నారు. డైరెక్టర్ డాక్టర్ సీవీరావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.అనిల్‌కుమార్, డెప్యూటీ మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ కె.కళ్యాణి, డాక్టర్ రాజగోపాల్, హెచ్‌వోడీలు పాల్గొన్నారు. ఆయా విభాగాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టుల సమగ్ర సమాచారం పోస్ట్ గ్రాడ్యుయేట్లు, డాక్టర్‌లు విద్యార్థులకు వివరించారు.

డెంటల్ కళాశాలలో...

చిన అవుటపల్లి డాక్టర్స్ సుధా అండ్ నాగేశ్వరరావు సిద్ధార్థ దంత వైద్య కళాశాలలో మూడవ రోజు ఎక్స్‌ప్లోర్–25 ఎగ్జిబిషన్ విద్యార్థుల సందర్శనతో సందడిగా సాగింది. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ రామోజీరావు ఆధ్వర్యంలో దంత వైద్యంలోని 9 విభాగాలను విద్యార్థులు సందర్శించి అవగాహన చేసుకున్నారు. దంతాల ప్రాముఖ్యతను హెచ్‌వోడీలు వివరించారు. అధునాతన దంతవైద్యం అతితక్కువకే అందిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చెప్పారు. డాక్టర్ అజయ్ బెనర్జీ, డాక్టర్ కాశేశ్వరరావు, ఏవో వై.మధుసూదనరావు పాల్గొన్నారు.

మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలి



ఈడుపుగల్లులో వరి పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి ఉషారాణి, రైతులు

కంకిపాడు: అధిక దిగుబడుల సాధనకు మేలైన యాజమాన్య చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి వి.ఉషారాణి అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు, కంకిపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విచక్షణారహితంగా ఎరువులు వినియోగించొద్దని సూచించారు. కేవలం వ్యవసాయ శాఖ సిఫారసుల మేరకు మాత్రమే ఎరువులు, పురుగు మందులు వాడాలన్నారు. ప్రతి రైతు పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. పంటల బీమాకు గడువు పెంచారని, బీమా చేయించుకుని ప్రకృతి విపత్తుల నుంచి రక్షణపొందాలని సూచించారు. కార్యక్రమంలో కంకిపాడు, ఈడుపుగల్లు సర్పంచ్‌లు పి.ఇందిర, బాకీ రమణ, రైతులు పాల్గొన్నారు.

నగర మార్కెట్‌లోకి సరికొత్త రెనో ట్రైబర్ కారు



మార్కెట్‌లోకి ఆవిష్కరిస్తున్న సరికొత్త రెనో ట్రైబర్ కారు

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడులోని రెనో కేష్‌విన్ వీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ షోరూమ్‌లో బుధవారం సరికొత్త రెనో ట్రైబర్ కారును నగర్ మార్కెట్‌లోకి మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్, పారిశ్రామికవేత్త గోపాలకృష్ణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ చందన్ మాట్లాడుతూ సరికొత్తగా రూపుదిద్దుకున్న ఈ కారులో వినియోగదారుల సౌకర్యార్థం అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఇనుమడింపజేసినట్లు తెలిపారు. మాడ్యులర్ డిజైన్, అధునాతన భద్రతా ప్రమాణాలు, మెరుగైన సౌకర్యాలతో ఈ కారు రూపుదిద్దుకుందన్నారు. పెట్రోల్ వెర్షన్‌లో నాలుగు మోడల్స్‌లో లభిస్తున్న ఈ కారు ప్రారంభ ధర రూ.6.29 లక్షలని వివరించారు. కార్యక్రమంలో వినియోగదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శ్రీకృష్ణస్వామి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవం



గన్నవరం: స్థానిక యాదవుల రామాలయం ఆవరణలో నూతనంగా నిర్మించిన శ్రీకృష్ణస్వామి వారి ఆలయ ప్రతిష్ఠా మహోత్సవాన్ని బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. తొలుత ఆవాహిత దేవతల హోమాలు, పీఠ, బీజ, ధాతు, రత్నన్యాసాలు జరిపారు. అనంతరం సుముహూర్తంలో యంత్ర ప్రతిష్ఠ, బింబ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ, కుంభాభిషేకాలు నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన భక్తుల కోలాహలం మధ్య నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాన్ని కన్నుల పండువగా జరిపారు. అనంతరం స్వామివారికి ప్రథమపూజ, శాంతి కల్యాణాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సుమారు పది వేల మంది భక్తులకు అన్నసమారాధన జరిపారు. నూతన ఆలయంలో స్వామివారిని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు దర్శించుకుని పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. యాదవ సంఘానికి చెందిన చిమట గంగాధరరావు, ఢిల్లీ సురేంద్రబాబు, చిమట రవివర్మ, పిన్నిబోయిన శ్రీనివాసరావు, సన్నాల రమేష్, చిమట శ్రీనివాసరావు, గంపా రాజేష్, చిన్న, గోపి, చిమట నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం



యనమలకుదురులో తల్లిపాల వారోత్సవాలు



తెంపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సత్యవాణి, నాగమల్లేశ్వరరావు



ఈడుపుగల్లులో అవగాహన ర్యాలీలో సీడీపీఓ బేబి సుకన్య, సర్పంచ్ పి.ఇందిర తదితరులు

పెనమలూరు: తల్లిపాలతోనే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎల్.సులోచనరాణి అన్నారు. గంగూరు గ్రామంలో బుధవారం 5, 6 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు ఇవ్వాలన్నారు. బిడ్డకు ఆరునెలల పాటు తల్లిపాలు ఇస్తే బిడ్డ సంపూర్ణ ఆరోగ్యంగా పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు కె.కరుణకుమారి, టి.కరుణమ్మ, ఎం.ప్రమీలారాణి, వి.వినయ్‌కుమారి, ఎలీశమ్మ, ఎస్.కుమారి, ఎం.నాగసుధ, ఎంఎస్‌కే భార్గవిలత పాల్గొన్నారు.

యనమలకుదురులో...

యనమలకుదురు 17, 19 అంగన్‌వాడీ కేంద్రాలలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు చేశారు. తల్లులు, బాలింతలు, గర్భిణులకు తల్లి పాల ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి.విజయలక్ష్మి, బి.సునీత, హలీమాబి, ఎం.లక్ష్మి, బి.పూర్ణసంధ్యారాణి, డి.జయశ్రీ, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

అంబాపురంలో తల్లిపాల వారోత్సవాలు

అంబాపురం(విజయవాడరూరల్): అంబాపురం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బుధవారం తల్లిపాల వారోత్సవాలు జరిగాయి. ఈ సందర్భంగా ఎంఎల్‌హెచ్‌పీ కె.కిరణ్మయి మాట్లాడుతూ ప్రతి తల్లి బిడ్డను ప్రసవించిన అరగంటలో ముర్రుపాలు తాగించాలన్నారు. ఆరు నెలల పాటు తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వలన తల్లి, బిడ్డకు ఆరోగ్యపరంగా ప్రయోజనం కలుగుతుందన్నారు. ఏఎన్‌ఎం జయలక్ష్మి మాట్లాడుతూ డబ్బా పాల కంటే తల్లిపాలు ఎంతో శ్రేష్టమన్నారు. కార్యక్రమంలో ఎంఎస్‌కే బి.కళ్యాణి, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డలకు అమృతం

గన్నవరంరూరల్: మండలంలోని తెంపల్లిలో బుధవారం ఐసీడీఎస్ గన్నవరం ప్రాజెక్టు ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ జె.సత్యవాణి మాట్లాడుతూ తల్లిపాలతో బిడ్డకు సమతుల ఆహారం అందుతుందని, మొదటి ఆరు నెలలు తల్లి పాలు ఇవ్వాలని చెప్పారు. ఆత్కూరు పీహెచ్‌సీ పీహెచ్ఎన్ వి.లక్ష్మీకుమారి మాట్లాడుతూ తల్లిపాలు ఇవ్వటం వల్ల రొమ్ము క్యాన్సర్ వచ్చే ప్రమాదం తప్పుతుందన్నారు. తల్లికి మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. హెల్త్ సూపర్‌వైజర్ అంకూరి నాగమల్లేశ్వరరావు మాట్లాడుతూ నులి పురుగులను నిర్మూలించాలని చెప్పారు. దీంతో రక్తహీనత ఉండదన్నారు. ఏఎన్ఎం జె.మంజుల, అంగన్వాడీ టీచర్‌లు కల్పన, కె.సుమతి, వి.నాగలక్ష్మి, ఆశ వర్కర్‌లు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు ఆరోగ్యరక్ష

కంకిపాడు: తల్లిపాలే బిడ్డ ఆరోగ్యానికి రక్ష అని కంకిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ కె.బేబి సుకన్య అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు–3వ అంగన్‌వాడీ కేంద్రం పరిధిలో బుధవారం ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. సీడీపీఓ బేబి సుకన్య మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు పట్టించాలన్నారు. ఆరు నెలల వరకూ కేవలం తల్లిపాలు మాత్రమే ఆహారంగా అందించాలని, ఎలాంటి ద్రావణం, మంచినీరు, ఇతర ఆహార పదార్థాలు ఆహారంగా ఇవ్వకూడదని సూచించారు. తల్లి పాలతోనే బిడ్డ ఆరోగ్యం ముడిపడి ఉందన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ షేక్ రెహానా బేగం, సర్పంచ్ పి.ఇందిర, అంగన్‌వాడీ కార్యకర్తలు మీరాబి, వసంత, ఖాజమ్మ, రామలక్ష్మి, సునీత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మూడు పీఏసీఎస్‌లకు కమిటీల నియామకం

గన్నవరం రూరల్: మండలంలోని మూడు పీఏసీఎస్‌లకు పాలకవర్గాలను ప్రభుత్వం బుధవారం నియమించింది. సూరంపల్లి పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గొట్టిపూళ్ళ వీరబాబు, పర్సన్‌లుగా బాణావత్ బాల నాయక్, రామినీడు బసవపూర్ణయ్య, పురుషోత్తపట్నం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా గుమ్మడి విజయలక్ష్మి, పర్సన్‌లుగా తాడిశెట్టి శ్రీనివాసరావు, కొండపల్లి శ్రీనివాసరావు, గోపవరపుగూడెం పీఏసీఎస్ చైర్‌పర్సన్‌గా వేమూరి రవి, పర్సన్‌లుగా దేవరపల్లి చింపిరయ్య, కొలుసు రాణిలను ప్రభుత్వం నియమించింది.

బదిలీపై వెళ్లిన నాగమల్లేశ్వరికి సత్కారం

కంకిపాడు: ఈడుపుగల్లు గాంధీనగర్ మోడల్ ప్రైమరీ పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేసి బదిలీపై ఉప్పలూరు ఎంపీయూపీ పాఠశాలకు వెళ్లిన సీహెచ్ నాగమల్లేశ్వరిని ఉపాధ్యాయులు బుధవారం ఘనంగా సత్కరించారు. ఉపాధ్యాయులు, మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది సన్మానించారు. ఉపాధ్యాయురాలు నాగమల్లేశ్వరి మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.మాలతి, పి.సాంబశివరావు, ఎం.శ్రీనివాసరావు, బి.బ్యూలా, పలువురు స్థానికులు పాల్గొన్నారు.

ఫుడ్ కమిషన్ చైర్మన్ ఆకస్మిక తనిఖీలు



వీరపనేనిగూడెం గురుకుల పాఠశాలలో కిచెన్ తనిఖీ చేస్తున్న చైర్మన్ విజయ ప్రతాపరెడ్డి

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలు, రేషన్ షాపులను ఏపీ ఫుడ్ కమిషన్ చైర్మన్ చింతా విజయప్రతాప్ రెడ్డి బుధవారం తనిఖీలు నిర్వహించారు. పెరికీడు వంతెన సమీపంలోని చౌకధరల దుకాణం సందర్శించి, అక్కడ స్టాకు రిజిస్టర్లు, సరుకు నిల్వలను తనిఖీ చేశారు. రేషన్ డీలర్ టంకాల కళావతి పనితీరుపై కార్డుదారులను అడిగి తెలుసుకున్నారు. ప్రతి నెలా వృద్ధులు, వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నారా లేదా అని ఆరా తీశారు. అనంతరం పెరికీడు, కానుమోలులోని అంగన్‌వాడీ కేంద్రాలను విజయప్రతాప్‌రెడ్డి సందర్శించారు. ఆయా కేంద్రాల్లో పిల్లల హాజరు పట్టీలు, గర్భిణులు, బాలింతల పోషకాహారం పంపిణీ రికార్డులు, స్టాకు రిజిస్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. చిన్నారుల కోసం వండిన ఆహారాన్ని స్వయంగా తిని సంతృప్తి వ్యక్తం చేశారు. కానుమోలులోని నూకల వీర రాఘవయ్య జెడ్పీ హైస్కూల్‌లో పదవ తరగతి విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజన పథకంపై ముఖాముఖి మాట్లాడారు. భోజనం నాణ్యత, నిర్ణీత మెనూ అమలు గుర్చి అడిగి తెలుసుకున్నారు. పిల్లల్లో పోషకాహార లోపాన్ని నివారించేందుకు ప్రభుత్వం ఐరన్, ఫోలిక్ యాసిడ్, బీ12 విటమిన్లతో కూడిన బియ్యాన్ని పాఠశాలలకు సరఫరా చేస్తుందని చెప్పారు. జిల్లా పౌరసరఫరాల అధికారి జి.మోహనరావు, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ టి.శివరామప్రసాద్, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.ఎన్.రాణి. డీఈవో పీవీజే రామారావు, సీడీపీవో మంగమ్మ పాల్గొన్నారు.

గురుకులం సందర్శించిన ఫుడ్ కమిషన్ చైర్మన్

గన్నవరంరూరల్: మండలంలోని వీరపనేనిగూడెం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలను బుధవారం ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ చైర్మన్ విజయప్రతాపరెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులతో సంభాషించి సమస్యలు విచారించారు. ఆహార నాణ్యత, పరిమాణంపై చర్చించారు. ఉప్మాకు బదులుగా ఎగ్ ఫ్రైడ్‌రైస్ లేదా టమాట రైస్ అందజేయాలని సూచించారు. పాఠశాల నిర్వహణ, విద్యార్థుల ప్రగతిని ప్రిన్సిపాల్ వై.యశోదలక్ష్మి వివరించగా అభినందించారు.

13న స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం



కృష్ణలంక(విజయవాడతూర్పు): 78వ స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 13వ తేదీ మధ్యాహ్నం 3 గంటలకు స్వాతంత్య్ర ఉద్యమ శంఖారావం నిర్వహిస్తున్నట్లు అమరావతి బాలోత్సవం ప్రధాన కార్యదర్శి ఆర్.కొండలరావు అన్నారు. నగరంలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ జి.లక్ష్మీశ చేతుల మీదుగా శంఖారావం కార్యక్రమానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండలరావు మాట్లాడుతూ.. జాషువా సాంస్కృతిక వేదిక, అమరావతి బాలోత్సవం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో 450 మంది విద్యార్థిని విద్యార్థులతో కళారూపాలు ప్రదర్శిస్తామన్నారు. కార్యక్రమంలో ఫోరం ఫర్ ఆర్టిస్ట్ అధ్యక్షులు సునీల్ కుమార్, అరసవల్లి గిరిధర్, జాషువా సాంస్కృతిక వేదిక కార్యదర్శి గుండు నారాయణరావు, పి.ఐజాక్ నూటన్, చంద్రిక, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.